క్లుప్తంగా

14న గ్రూప్‌-1,2 పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్‌: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్‌–1, 2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఈనెల 14న ఉదయం 10 గంటలకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు 21వ సెంచరీ ఐఏఎస్‌ అకాడమీ చైర్మన్‌ పి.కృష్ణప్రదీప్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ మోటివేషనల్‌ స్పీకర్‌ ఆకెళ్ల రాఘవేంద్ర, సీనియర్‌ అధ్యాపకులు హాజరు కానున్న సదస్సులో గ్రూప్‌–1, 2 సిలబస్‌, ప్రిపరేషన్‌ స్ట్రాటజీ, నోట్స్‌ మేకింగ్‌, సమయపాలన తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌, ఆఫ్‌లైన్‌ విధానంలో నిర్వహిస్తున్న సదస్సుకు సంబంధించిన వివరాలకు 040–35052121, 9000230734 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అభయాంజనేయస్వామికి లక్ష తులసి పూజ



నగరంపాలెం: కొత్తపేటలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్‌ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం లక్ష తులసి పూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో హనుమాన్‌ సేవాస సమితి గౌరవ అధ్యక్షుడు టి.వెంకటసుబ్బారావు, అధ్యక్షుడు చేపల నాగేశ్వరరావు, కార్యదర్శి అనిల్‌కుమార్‌ పాల్గొన్నారు.

గుడి-బడి సభ్యుల ఆధ్వర్యంలో ఆలయాల శుభ్రం



పట్నంబజారు: మారుతీనగర్‌లోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం ప్రవణ పీఠం సభ్యులు సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. మన గుడి – బడిలో భాగంగా ఆలయ నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు త్వరలో జరగనున్న హనుమత్‌జ్జయంతి పురస్కరించుకుని ఆలయాన్ని శుభ్రం చేశారు. చుట్టూ పిచ్చి మొక్కలు పీకివేశారు. ఈ సందర్భంగా మన గుడి – బడి సభ్యులు వంశీ, ప్రసాద్‌ మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఒక ఆలయాన్ని, బడిని శుభ్రం చేసే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సనాతన ధర్మంలో హైందవ ధర్మం ఎంతో గొప్పదని, దాన్ని కాపాడుతూ, ఆలయాలు శుభ్రపరుస్తూ ప్రతి ఒక్కరిలో చైతన్యం కలిగించే దిశగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మన గుడి, బడి సభ్యులు ఓంకార్‌ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవం



పట్నంబజారు: గుంటూరు రూరల్‌ పరిధిలోని జోనమ్‌ చుండూరులో గురువారం జరిగిన సీతారామచంద్రస్వామి దేవస్థాన ప్రతిష్ట మహోత్సవంలో వైఎస్సార్‌ సీపీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు తాడిశెట్టి మురళీ మోహన్‌ పాల్గొన్నారు. స్వామికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తాడిశెట్టి మురళీ మోహన్‌ మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు దేవస్థాన ప్రతిష్ఠకు, సీతారామచంద్ర స్వామి ఆలయ ఏర్పాటుకు తనవంతు ఆర్థికసాయం అందించినట్లు చెప్పారు. గ్రామంలో పండుగ వాతావరణంలో స్వామి ప్రతిష్ట నిర్వహించడం సంతోషదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు మాదా రాధాకృష్ణమూర్తి, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లిఫ్ట్‌ ఇచ్చి..మెడలో గోల్డ్‌ చైన్‌ ఎత్తుకెళ్లాడు

సుద్దపల్లి (చేబ్రోలు): గుర్తు తెలియని యువకుడు బైక్‌పై వచ్చి.. మహిళను బెదిరించి, బంగారు గొలుసు అపహరించిన ఘటన సుద్దపల్లి గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. సుద్దపల్లి గ్రామానికి చెందిన పోతురాజు సామ్రాజ్యం మండల పరిధిలోని వడ్లమూడి సంగం డెయిరీలో ఉద్యోగిగా పనిచేస్తోంది. డెయిరీ నుంచి ఇంటికెళ్లేందుకు బుధవారం రాత్రి వడ్లమూడి క్వారీ దేవాలయం సమీపంలోని రోడ్డు వద్ద నిలబడింది. ఈ సమయంలో గ్రామంలోకి వెళ్తున్నానని చెప్పిన గుర్తు తెలియని యువకుడు, ఆమెను బైక్‌పై ఎక్కించుకున్నాడు. రైల్వే గేట్‌ సమీపంలో ఆపి ఆమెను బెదిరించి, మెడలో ఉన్న సుమారు రూ.1.40 లక్షల విలువ చేసే నాలుగున్నర సవర్ల బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. సామ్రాజ్యం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జి.వెంకటాద్రి కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

సమన్వయంతో నగరాభివృద్ధికి కృషి

మేయర్‌ కావటి, ఎమ్మెల్యే ముస్తఫా



అధికారులతో సమావేశమైన మేయర్‌ కావటి, ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్‌: నగర సమగ్రాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారుల్ని పాలకవర్గం సమన్వయం చేసుకుంటూ పాటుపడుతోందని నగర మేయర్‌ కావటి శివనాగ మనోహర్‌ నాయుడు తెలిపారు. ఆయన అధ్యక్షతన గురువారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్‌ హాలులో తూర్పు నియోజకవర్గంలోని 12, 13, 14, 15, 17 డివిజన్ల పరిధిలో అభివృద్ధి పనులపై నియోజకవర్గ ఎమ్మెల్యే ముస్తఫాతో కలసి ఇంజనీరింగ్‌ అధికారులతో సమావేశమయ్యారు. తొలుతగా ఏఈలు, డివిజన్ల వారీగా టెండర్‌ పూర్తయి, ప్రారంభంకాని పనులపై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ టెండర్‌ ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పనుల నిర్వహణపై త్వరలోనే వారితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. నూతన పాలకవర్గం ఏర్పడ్డాక గుంటూరు నగరంలో కుల మత, పార్టీ, ప్రాంతాలకతీతంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టెండర్‌ దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేయకపోవడం వల్ల స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రజల ఆహ్లాదం కోసం గాంధీ పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని, త్వరలోనే పనుల్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వస్తామని వెల్లడించారు. ఇప్పటికే నగరంలో పలు ప్రాంతాల్లో పార్కుల్ని అభివృద్ధి చేశామన్నారు. రోడ్ల విస్తరణ పనులు మునుపెన్నడూ లేనివిధంగా వేగంగా జరుగుతున్నాయని వివరించారు. రైల్వే క్రాసింగ్‌ల వద్ద పెండింగ్‌లో ఉన్న ఆర్వోబీ, ఆర్‌యూబీ పనుల్ని ఆ శాఖ అధికారులతో మాట్లాడి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో జాప్యం తగదని, సమస్యలుంటే అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. టెండర్‌ దక్కించుకొని పనులు సకాలంలో నిర్వహించని కాంట్రాక్టర్లను బ్లాక్‌ లిస్టులో పెట్టాలని తెలిపారు. కాంట్రాక్టర్లతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్‌ అధికారులకు ఆయన చెప్పారు. సమావేశంలో కార్పొరేటర్లు ఖాజా మొహిద్దీన్‌ చిష్టి, సంకూరి శ్రీనివాసరావు, వేముల జ్యోతి పద్మజ, రమణబోయిన అజయ్‌ యాదవ్‌, షేక్‌ ఫర్జానా, వైఎస్సార్‌ సీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్‌ నూరి ఫాతిమా, నగర పాలక సంస్థ ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ కళ్యాణ్‌రావు, ఏఈలు, ఎమినిటి కార్యదర్శులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

విరించి ఫ్యాషన్స్‌ షాపింగ్‌ మాల్‌లో ఎగ్జిబిషన్‌ సేల్‌ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ సేల్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సినీ నటి ప్రణీత సుభాష్‌

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం రోడ్డులోని బేకర్స్‌ ఫన్‌ ఎదురుగా ఉన్న విరించి ఫ్యాషన్స్‌ షాపింగ్‌ మాల్‌లో గురువారం మెగా ఎగ్జిబిషన్‌ సినీ నటి ప్రణీత సుభాష్‌ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గుంటూరు నగర వస్త్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అబ్బుర పరిచే డిజైన్లు, లక్షలాది వెరైటీలు, సరికొత్త బ్రైడల్‌ కలెక్షన్‌తో అన్ని రకాల పట్టు వస్త్రాలు తయారీ దారులు అందించే ధరలకు లభించడం గొప్ప విషయమన్నారు. మదర్స్‌ డే సందర్భంగా తన తల్లికి చీర కొనుగోలు చేసి బహుమతిగా ఇస్తున్నట్లు తెలిపారు. బ్రైడల్‌ కలెక్షన్స్‌, కాంచీవరం చీరలు బాగున్నాయని తెలిపారు. షోరూం అధినేత రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 31 వరకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మెగా ఎగ్జిబిషన్‌ సేల్‌ అందుబాటులో ఉంటుందని తెలిపారు. జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు ఖాతాదారులు, మిత్రులు, పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరి అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి

గుంటూరు ఈస్ట్‌: సెంట్రల్‌ జీఎస్టీ అధికారులమంటూ వసూళ్లకు పాల్పడిన ఇద్దరు నిందితుల్ని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు స్టేషన్‌లో గురువారం వెస్ట్‌ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ రామానాయక్‌లు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెంట్రల్‌ జీఎస్టీలో గుమస్తాగా పనిచేసే జి.వెంకటబాబు, స్నేహితుడ్ని వెంటబెట్టుకుని ఈనెల 6వ తేదీ బ్రాడీపేట 6/14లోని గేమ్‌ వరల్డ్‌ షాపునకు వెళ్లారు. యజమాని షేక్‌ ఖాజాను తాము సెంట్రల్‌ జీఎస్టీ అధికారులమంటూ పరిచయం చేసుకున్నారు. వెంకటబాబు తీసుకొచ్చిన ద్విచక్ర వాహనంపై జీఎస్టీ అని రాసి ఉండటంతో ఖాజా అధికారులని నమ్మాడు. ఇద్దరు జీఎస్టీ చెల్లించాలని బెదిరించారు. ఖాజా అందుకు ఒప్పుకొని రూ. 1700 చెల్లించాడు. అనంతరం ఇద్దరు షాపులోని బ్లూతూత్‌ను అడిగి తీసుకుని వెళ్లారు. ఖాజా నిందితులు వచ్చిన ద్విచక్ర వాహనం నంబరు నోటు చేసుకుని అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులు వెంకటబాబు, అతని అనుచరుడు దార్ల సురేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. గురువారం ఇద్దరిని అరెస్టు చేసి రూ. 1700తో పాటు బ్లూతూత్‌, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. ఈ కేసులో వాటి ఆధారంగానే నిందితుల్ని గుర్తించామని తెలిపారు. సైబర్‌ క్రైం కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, ప్రజలు వీటిపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అత్యాసకు పోకూడదన్నారు. సోషల్‌ మీడియాలో వచ్చే లింకుల్ని ఆన్‌ చేయవద్దని తెలిపారు. కేసు పురోగతిలో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు.


తాగునీటి సరఫరాపై అశ్రద్ధ వద్దు



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్‌ కీర్తి చేకూరి

నెహ్రూనగర్‌: నగరంలో తాగునీటి సరఫరాలో ఎక్కడా సమస్యలు రాకుండా ఇంజినీరింగ్‌ అధికారులు, ఎమినిటీ కార్యదర్శులు పక్కా ప్రణాళికతో విధులు నిర్వహించాలని, సమస్యలు వస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని నగర కమిషనర్‌ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఆమె గురువారం వెంగళాయపాలెంలోని నగరపాలక సంస్థ సమ్మర్‌ స్టోరేజ్‌ ట్యాంక్‌, ఆవుల సంరక్షణ కేంద్రం, వెంకటరమణ కాలనీలో ఎన్‌ఓసీకి దరఖాస్తు చేసుకున్న భవనాల్ని పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. తొలుత వెంగళాయపాలెంలో నగరపాలక సంస్థ సమ్మర్‌ స్టోరేజ్‌ ట్యాంక్‌ని పరిశీలించారు. చెరువు విస్తీర్ణం, నీటి నిల్వ, నగరానికి సరఫరా మార్గంపై ఇంజినీరింగ్‌ అధికారుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వెంగళాయపాలెం చెరువులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయడానికి, మోటార్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్‌ఈని ఆదేశించారు. చెరువు పూర్తిస్థాయిలో నీటితో ఉంటేనే నగరంలోని ఏటీ అగ్రహారం, హౌసింగ్‌ బోర్డ్‌ తదితర రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలకు సమృద్ధిగా తాగునీటిని సరఫరా చేయగలమని చెప్పారు. చెరువు నింపేందుకు ఎన్‌ఎస్‌పీ కెనాల్‌ ఆధారం కనుక ఇరిగేషన్‌ అధికారులతో చర్చించాలని ఆదేశించారు. చెరువు పరిసరాల్లో వీధి ఆవుల సంరక్షణకు కేటాయించిన సిబ్బంది బాధ్యతగా పని చేయాలని, వాటికి సకాలంలో ఆహారం అందించేలా చూడాలని తెలిపారు. వారానికి రెండు రోజులు పశు వైద్యులు వచ్చేలా ఆ శాఖ జాయింట్‌ డైరెక్టర్‌కు లేఖ రాయాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. అనంతరం వెంకట రమణ కాలనీలో ఎన్‌ఓసీకి దరఖాస్తు చేసుకున్న భవనాల్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ భాస్కర్‌, ఎంహెచ్‌ఓ డాక్టర్‌ భానుప్రకాష్‌, డెప్యూటీ సిటీప్లానర్‌ మూర్తి, ఏసీపీ బాబూరావు, ఈఈలు సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, డీఈఈ రమేష్‌బాబు, సర్వేయర్‌ సునీల్‌ కుమార్‌, టీపీఎస్‌ లక్ష్మణస్వామి, ఏఈ నాగవేణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ మల్లికార్జునరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టల్‌ యూనియన్‌ గుర్తింపును పునరుద్ధరించాలి



ప్రదర్శనలో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నేతలు

లక్ష్మీపురం: పోస్టల్‌ రంగంలో అతి పెద్ద యూనియన్‌గా ఉన్న నేషనల్‌ ఫెడరేషన్‌ఆఫ్‌ పోస్టల్‌ ఎంప్లాయిస్‌(ఎన్‌ఎఫ్‌పీఈ) గుర్తింపును పునరుద్ధరించాలని కోరుతూ నగరంలోని శంకర్‌ విలాస్‌ సెంటర్‌ నుంచి డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ సర్కిల్‌ వరకు గురువారం సాయంత్రం భారీ ప్రదర్శన నిర్వహించారు. శాసన మండలి సభ్యుడు కె.ఎస్‌.లక్ష్మణరావు మాట్లాడుతూ పోస్టల్‌ రంగంలో ప్రైవేటీకరణ విధానాల్ని వ్యతిరేకిస్తూ పలు ఉద్యమాలు చేస్తున్న ఎన్‌ఎఫ్‌పీఈ గుర్తింపును అప్రజాస్వామికంగా రద్దు చేయడం కార్మిక సంఘాల హక్కుల్ని కాలరాయడమేనని తెలిపారు. సహేతుకమైన కారణాలు చూపకుండా కేవలం రైతుల ఉద్యమానికి, సోదర సంఘాల ఉద్యమాలకు ఆర్థికంగా సహాయపడ్డారనే నెపంతో యూనియన్‌ గుర్తింపును నిరాకరించడం ప్రజాస్వామ్య పద్ధతుల్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గుర్తింపును పునరుద్ధరించాలని ఆయన డిమాండ్‌ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక సంఘాల మనుగడను దెబ్బతీస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాల్ని ఏకపక్షంగా రద్దు చేసి నూతన లేబర్‌ కోడ్స్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాల్ని ఐక్య పోరాటాల ద్వారా ఎదుర్కొంటామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు, పెన్షనర్స్‌ తరఫున ఎం.రామకృష్ణ, వి.వి.కె. సురేష్‌, సీహెచ్‌. కుమార్‌, ఎం. కళాధర్‌, బి.ముత్యాలరావు, ఎల్‌.అరుణ, మేడా హనుమంతరావు, ఎం.ఏ.చిష్టి, ఎన్‌ నాగేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు, కె. భాను ప్రసాద్‌, టి.వి.జి.రవిశంకర్‌, సీహెచ్‌. విద్యాసాగర్‌, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



గుంటూరు వెస్ట్‌: 32వ డివిజన్‌లో పలు రోడ్లకు స్థానిక కార్పొరేటర్‌ ఈచంపాటి ఆచారి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాడీపేట 2/17తో పాటు 13వ అడ్డ రోడ్డు ఓంకార క్షేత్రం నుంచి 17వ అడ్డ రోడ్డు బండ్లమూడి హనుమాయమ్మ కాలేజీ వరకు, బ్రాడీపేట పార్క్‌ సమీపంలోని కనెక్టింగ్‌ రోడ్లు సుమారు 180 మీటర్ల పొడవు సీసీ రోడ్లు వేస్తున్నామని తెలిపారు. పనుల్ని ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని చెప్పారు. ఇప్పటికే బ్రాడీపేట పార్క్‌ను రూ.24 లక్షలతో అభివృద్ధి చేస్తున్నామని, త్వరలో పూర్తవుతుందని వెల్లడించారు. ముప్పై ఏళ్లకు పైగా మరమ్మతులకు కూడా నోచుకోని రోడ్లను ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో శరవేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో 32వ డివిజన్‌ అధ్యక్షుడు రత్నప్రసాద్‌, బందా రవీంద్ర, అయితి శ్యామ్‌, జాయ్‌ అండ్‌ షైన్‌ చీఫ్‌ కోచ్‌ జె.జ్యోతి శ్యామ్‌, బీఈడీ కాలేజ్‌ ప్రిన్సిపాల్‌ పి.యానీ అమల, అనుషా బేబి, డీఈ రఫిక్‌, ఏఈ రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో యువకుడికి గాయాలైన ఘటన చేబ్రోలులో గురువారం జరిగింది. వివరాల మేరకు.. చేబ్రోలు ప్రాంతానికి చెందిన వి.బసవపున్నయ్య బైక్‌పై వస్తుండగా సినిమా హాలు ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో బసవపున్నయ్య కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనం ద్వారా ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పవర్‌ లిఫ్టర్‌ అబ్దుల్‌ మతీన్‌కు అభినందనలు



క్రీడాకారుడు అబ్దుల్‌ మతీన్‌ను అభినందిస్తున్న డాక్టర్‌ ఆలా వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్‌: నగరానికి చెందిన క్రీడాకారుడు షేక్‌ అబ్దుల్‌ మతీన్‌ కేరళ రాష్ట్రంలో మే 2 నుంచి 6 వరకు జరిగిన పవర్‌ లిఫ్టింగ్‌ పోటీల్లో వెండి పతకం సాధించాడు. ఈ సందర్భంగా గుంటూరు నగరానికి చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్‌ ఆలా వెంకటేశ్వర్లు అమరావతి రోడ్డులోని ఆలా హాస్పిటల్‌లో మతీన్‌ను అభినందించారు. డాక్టర్‌ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశానికి ఒలంపిక్స్‌లో పతకాలు రావాలంటే ప్రతిభ ఉన్న క్రీడాకారుల్ని ప్రోత్సహించాలన్నారు. ఈ రోజుల్లో క్రీడలకు సంసిద్ధం కావడం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని తెలిపారు. సంపన్నులెవరు క్రీడలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదని, ప్రభుత్వ, ప్రైవేటు, పారిశ్రామిక సంస్థలైనా ప్రతిభ కలిగిన క్రీడాకారుల్ని ప్రోత్సహించాలని కోరారు. షేక్‌ అబ్దుల్‌ మతీన్‌ తండ్రి షేక్‌ బాకర్‌ హుస్సేన్‌ ప్రైవేటు సంస్థలో చిరు ఉద్యోగి అయినా కొడుకుని మంచి క్రీడాకారునిగా తీర్చిదిద్దుతున్నందుకు అభినందించారు. అబ్దుల్‌ మతీన్‌ మాట్లాడుతూ డాక్టర్‌ ఆలా వెంకటేశ్వర్లు అందించిన ఆర్థిక సహాయంతో విజయం సాధించానని తెలిపారు. తనను ప్రోత్సహిస్తున్న ఆయనకు కృతజ్ఞతలు తెలిపాడు.

ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వాలి: ఫ్యాప్టో



డీఈవో శైలజకు వినతి పత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్‌: వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు అప్పగిస్తున్న వివిధ రకాల పనుల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజకు ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు. వేసవిలో ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వకుండా వేర్వేరు కార్యక్రమాల్ని అప్పగించి, పాఠశాలల్లోనే ఉండాలని అధికారులు ఒత్తిడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్టాల్‌ బాలికోన్నత పాఠశాలలో డీఈవో శైలజను కలసి వినతిపత్రం సమర్పించారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌ ఎం. కళాధర్‌ మాట్లాడుతూ నాడు–నేడు, ఆన్‌లైన్‌ ట్రైనింగ్‌, టెన్త్‌లో ఫెయిల్‌ అయిన విద్యార్థులకు ప్రత్యేక బోధనా తరగతుల పేరుతో రాతపూర్వక ఆదేశాలు లేకుండా మౌఖిక ఆదేశాల ద్వారా ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. సెలవుల్లో పనిచేసినందుకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. డీఈవోను కలసిన వారిలో ఫ్యాప్టో డెప్యూటీ సెక్రటరీ జనరల్‌ జి. మోహనరావు, ఎండీ. ఖాలీద్‌, జి. వేళాంగిణిరాజు, కార్యవర్గ సభ్యులు సీహెచ్‌. నరసింహారావు, కె. బసవ లింగారావు, ఎం. సుబ్బారావు ఉన్నారు.

సిగ్నల్స్‌ అండ్‌ సిస్టమ్స్‌ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న వీసీ రాజశేఖర్‌ తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అకడమిక్‌ ఎఫైర్స్‌ డీన్‌ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి రాసిన 'సిగ్నల్స్‌ అండ్‌ సిస్టమ్స్‌' పుస్తకాన్ని గురువారం వీసీ ఆచార్య పి రాజశేఖర్‌, రిజిస్ట్రార్‌ ఆచార్య బి. కరుణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇంజినీరింగ్‌ విద్యార్థులకు జాతీయ స్థాయి లో ప్రయోజనకరమైన పుస్తకాన్ని ఏఎన్‌యూ అధ్యాపకుడు రాయడం అభినందనీయమన్నారు. రచయిత శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గేట్‌, ఐఈఎస్‌ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. సులభతరమైన అంశాలతో విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. బీఎస్‌ పబ్లికేషన్‌ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురిస్తుందని తెలిపారు. ఇంజినీరింగ్‌ విద్యార్థుల కోసం తాను ఇప్పటికే ఆరు పుస్తకాలు, రెండు వ్యక్తిత్వ వికాస కథా సంకలనాలు రాశానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ బీహెచ్‌. నాగకిశోర్‌, సీఈ నరసారెడ్డి, వికాస అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌ కుమార్‌, శ్రీనివాసరావు, యూత కుమార్‌ రాజు, డీఈ అప్పారావు పాల్గొన్నారు.

శ్రీ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం: ఆర్‌.అగ్రహారంలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త వెంకటబుచ్చిరామ శాస్త్రి, కార్యనిర్వాహణాధికారి పగడాల శివకోటేశ్వరరావు, ధర్మకర్తల మండల సభ్యులు ముత్తురాజు, కె.శ్రీవల్లి, శికుమారి, 18వ డివిజన్‌ కార్పొరేటర్‌ నిమ్మల వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం

పాత గుంటూరులోని విశాఖ శ్రీ శారదా పీఠ పరిపాలిత శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్‌ జయంతి వేడుకలు రెండో రోజుకి చేరాయి. గురువారం తెల్లవారుజామున 5.30 గంటల నుంచి ప్రభాత సేవ, ఆలయ ప్రదక్షిణలు, ఆకు పూజలు, తీర్థ గోష్టి, ప్రసాద వినియోగం నిర్వహించారు. తొమ్మిది గంటలకు శ్రీ వీరాంజనేయస్వామికి పంచామృత అభిషేకం చేశారు. భక్తులు బారులుతీరి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పురావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు, కోశాధికారి గ్రంధి కోటేశ్వరరావు, సభ్యులు ఆత్మకూరి లక్ష్మణరావు, చీమకుర్తి తాండవ నాగమల్లేశ్వరరావు, కాసుల వెంకటశివప్రసాద్‌, నాగం రామారావు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత ఆశ్రయం

నగరంపాలెం: స్థానిక శ్రీనగర్‌ ఏడో వీధిలోని మాతృశ్రీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉచిత ఆశ్రయం కల్పిస్తున్నట్లు డైరెక్టర్‌ నడింపల్లి జానకీ శైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథ వృద్ధులు, పని ఒత్తిడిలో సరిగా చూడలేకపోతున్న వారి కుటుంబాల సౌకర్యార్థం ఉచిత వసతి, భోజనం, వైద్య సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 98484 06465, 7288809389 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బాలికపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్‌: బాలికపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్‌ 2వ లైనులో నివసించే సునీల్‌ చంద్రయ్యనగర్‌లోని స్నేహితుడి ఇంటికి వెళుతుంటాడు. ఈ సమయంలో పక్కనే ఉన్న ఇంట్లోని బాలికతో పరిచయం పెంచుకున్నాడు. బుధవారం తన పుట్టిన రోజు అని చెప్పి ఆమెను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను ఇంటి సమీపంలో వదిలిపెట్టి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీరింగ్‌ విద్యార్థిని ఆత్మహత్య

ఇంజినీరింగ్‌ విద్యార్థిని ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈపూరుకు చెందిన వెంకట నరసింహారావు కుమార్తె జి.శ్రీప్రణీత (20) గుంటూరు విద్యానగర్‌లోని బంధువుల ఇంట్లో ఉండి ఇంజినీరింగ్‌ మూడో సంవత్సరం చదువుతోంది. చదువులో వెనుకబడడంతో మానసికంగా కుంగిపోయి ఈనెల 7న ఎలుకల మందు తిని, కుటుంబ సభ్యులకు ఆలస్యంగా చెప్పింది. ఆమెను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమష్టి కృషితో మండలాభివృద్ధి

గుంటూరు రూరల్‌: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషిచేసి మండలాభివృద్ధికి పాటుపడదామని గుంటూరు రూరల్‌ మండలం ఎంపీపీ పులగం దివ్య పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని మండల ప్రజా పరిషత్‌ కార్యాలయంలో రూరల్‌ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జ్‌ ఎంపీడీవో శోభారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి సందర్భంగా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నాణ్యతలోపాలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీపీ స్పష్టం చేశారు. అనంతరం మండల స్థాయిలోని వివిధ విభాగాల అధికారులు గతంలో జరిగిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఏ విధంగా సద్వినియోగించుకోవాలో ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రస్తుతం మండలంలో జొన్నలగడ్డ, చిన్నపలకలూరు, మల్లవరం తదితర గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీలు ఇంటూరి పద్మావతి, దర్శి సుజాత, ఎంపీటీసీ రమేష్‌, సర్పంచ్‌లు నల్లమేకల అప్పమ్మ, ఏరువ పద్మావతి, మాధవరావు, రాంజీ అబేడ్కర్‌, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.